సాక్షి కర్నూలు

గురువారం • 1 • మే • 2025



బంగారు దుకాణంలో చోరీ

పత్తికొండలోని బంగారు దుకాణంలో చోరీ జరిగింది. 8 జతల బంగారు కమ్మలు, ఒకటిన్నర కేజీల వెండి ఆభరణాలు, రూ.3 లక్షలను అపహరించినట్లు బాధితుడు తెలిపారు. 8లో▸



సెంటిమెంట్ పండింది

అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.250 కోట్ల వ్యాపారం జరిగి ఉండొచ్చని అంచనా. 8లో▸



అధికారులు ఈ వంక చూడరు?

డోన్ పట్టణ నడిబొడ్డున వంకను కొందరు టీడీపీ నాయకులు పూడ్చివేస్తున్నారు. రేకుల షెడ్డును నిర్మించి మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్‌ను కూడా పొందారు. 8లో▸

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్–2025 బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించిన పరీక్షకు కర్నూలు నగరంలో 12 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 4,595 మంది విద్యార్థులకుగాను 4,003 మంది హాజరయ్యారు. ఆదోనిలో ఏర్పాటు చేసిన 10 కేంద్రాల్లో 2,771 మందికి గాను 1,660 మంది హాజరయ్యారు. జిల్లా కో–ఆర్డినేటర్‌గా ప్రభుత్వ పాలిటెక్నిక్ ఫర్ మైనార్టీ కాలేజీ ప్రిన్సిపాల్ ఓ. శ్రీధర్, జిల్లా పరిశీలకులుగా స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ఏపీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగేశ్వరరావు, టౌన్ అబ్జర్వర్‌గా టి.శ్రీనివాసులు వ్యవహరించారు. వీరు పలు కేంద్రాలను తనిఖీ చేశారు.

రానున్న మూడు రోజుల్లో అకాల వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న మూడు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఒక వైపు వడగాల్పులు, మరోవైపు ఉరుములు, మెరుపులు, పిడుగులు, అకాల వర్షాల కురిసే అవకాశం ఉంది. గంటకు 40–50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉన్నట్లు పేర్కొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండలు, వడగాల్పులు, సాయంత్రం నుంచి ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

గిరిజన గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో 3వ తరగతి ప్రవేశాలతో పాటు 4 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లలో ప్రవేశానికి గిరిజన వర్గాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి కె.తులసీదేవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. గిరిజన సంక్షేమ గురుకులాలు బాలికలకు కర్నూలు, ఆలూరు, బాలురకు తుగ్గలిలో ఉన్నాయన్నారు. ఈ మూడు గురుకులాల్లో 3వ తరగతి ప్రవేశాలకు మొత్తం 120 సీట్లు ఉన్నాయన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 1 నుంచి 20వ తేదీలోగా ఆయా పాఠశాలల్లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 30న కర్నూలు బిర్లాగేట్ సమీపంలోని గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కార్యాలయంలో లాటరీ పద్ధతిన సీట్లు కేటాయిస్తామన్నారు.

నీట్ యూజీ-2025కు హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కర్నూలు కల్చరల్: ఈనెల 4వ తేదీన నిర్వహిస్తున్న నీట్ యూజీ–2025 పరీక్ష సందర్భంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. పరీక్షకు సంబంధించి ఏవైనా సమస్యలు, ఇబ్బందులు, సందేహాలు ఉన్నా నివృత్తి కోసం హెల్ప్ డెస్క్ నెంబర్ 08518 277305కు ఫోన్ చేయవచ్చన్నారు. మే 3, 4 తేదీలు రెండు రోజులు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హెల్ప్ డెస్క్ అందుబాటులో ఉంటుందన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ ర్యాంపులు



మాట్లాడుతున్న డీఆర్‌ఓ వెంకట నారాయణమ్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ ర్యాంపులు ఉండేలా చర్యలు చేపడతామని డీఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి వైకల్య కమిటీ సమావేశాన్ని సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శారీరక వికలాంగులకు ప్రత్యేక వైకల్య గుర్తింపు కార్డుల మంజూరు దరఖాస్తులు చాలా పెండింగ్‌లో ఉన్నాయని సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. వాటిని వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయి వైకల్య కమిటీ సమావేశాన్ని ఆరు నెలలకు ఒకసారి నిర్వహించేలా చూస్తామన్నారు. సభ్యులు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి శామ్యూల్, విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రాయిస్ ఫాతిమా, ఎల్‌డీఎం రామచంద్రరావు పాల్గొన్నారు.

వైద్య సేవలు సమ్మెసిల్లుతున్నాయ్!



ధర్నా చేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీలు

- సమ్మెలో ఎంఎల్‌హెచ్‌పీలు
- మూతపడిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- జిల్లాలో 225 మంది ఎంఎల్‌హెచ్‌పీల విధులు
- సేవలు నిలిచిపోవడంతో పీహెచ్‌సీలకు వెళ్తున్న రోగులు
- డిమాండ్ల సాధనకు 15 రోజులుగా ఆందోళన
- ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిరవధిక ఆందోళన
- ఏడాదిగా నిలిచిపోయిన పీఎఫ్, ఇన్సెంటివ్‌లు, పెరిగిన పనిభారం



మూతబడిన తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్

కర్నూలు(హాస్పిటల్): విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో విధులు నిర్వర్తించే ఎంఎల్‌హెచ్‌పీలు సమ్మె బాటపట్టడంతో గ్రామీణ పేదలకు వైద్య సేవలు దూరమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎల్‌హెచ్‌పీలకు రావాల్సిన ప్రోత్సాహకాలు నిలిపివేయడమే గాక అదనపు పనిభారాన్ని మోపుతోంది. దీంతో గత కొన్ని రోజులుగా వారు సమ్మె చేస్తున్నారు. ఈ కారణంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడ్డాయి. కర్నూలు జిల్లాలో 425, నంద్యాల జిల్లాలో 506 హెల్త్ వెల్‌నెస్ సెంటర్లు/విలేజ్ హెల్త్ క్లినిక్‌లు (వైఎస్‌ఆర్ హెల్త్ క్లినిక్స్) ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో సబ్ సెంటర్ల స్థానంలో ఏర్పాటైన వీటిలో పీహెచ్‌సీ స్థాయి వైద్యసేవలు అందేవి. ఇందులో 14 రకాల వైద్యపరీక్షలు, 105 రకాల మందులు, 67 రకాల వైద్యపరికరాలను అప్పటి ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఇందులో ప్రత్యేక శిక్షణ పొందిన బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేసిన వారు మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు/కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా విశేష సేవలందించారు. ఈ క్రమంలో వీటిని మినీ పీహెచ్‌సీలుగా కూడా అప్పట్లో పేర్కొనేవారు. ఈ కేంద్రానికి వచ్చిన రోగులకు సాధారణ జబ్బులు, పిల్లలకు, గర్భిణులకు అందించే చికిత్సలతో పాటు దీర్ఘకాలిక జబ్బులైన బీపీ, షుగర్‌లకు సైతం వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు కూడా అందించేవారు. రోగికి వచ్చిన జబ్బు గురించి ఏవైనా అనుమానాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీ లేదా జిల్లా కేంద్రంలోని టెలిమెడిసిన్ సెంటర్‌లోని వైద్యులకు ఫోన్ చేసి రోగులతో మాట్లాడించి చికిత్స చేయించారు. దీనివల్ల రోగులు సుదూర ప్రాంతాల్లోని ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకునే అవసరం తప్పేది.

కూటమి ప్రభుత్వం చిన్నచూపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విలేజ్ హెల్త్ క్లినిక్స్ పట్ల చిన్నచూపు చూస్తోంది. అక్కడ పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌ఓలకు జీత భత్యాలు ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన ఎంఎల్‌హెచ్‌పీలను రెగ్యులర్ చేయాల్సి ఉన్నా చేయడం లేదు. జీవో నెం.64 ప్రకారం ఎన్‌హెచ్‌ఎంలో అన్ని కేడర్ల ఉద్యోగులకు 23 శాతం పీఆర్‌సీ ఇవ్వాల్సి ఉంది. 189 కేడర్లకు ఇచ్చి ఎంఎల్‌హెచ్‌పీలకు మాత్రం ఇవ్వలేదు. అందరికీ పీఎఫ్ ఇస్తున్నా వీరికి మాత్రం ఇవ్వడం లేదు. ఏడాది కాలంగా ఇన్సెంటివ్‌లు కూడా మంజూరు కాలేదు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ ఇండికేటర్స్ ఆధారంగా పనిచేయాల్సి ఉంది. కానీ వారికి ఇతర పనులు కూడా చెప్పి పనిభారం మోపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనికితోడు వారికి హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయడం లేదు. ఎవ్వరైనా మరణిస్తే మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదు.

రోగులకు మళ్లీ ఇబ్బందులు

ఎంఎల్‌హెచ్‌పీల సమ్మె కారణంగా ఈ నెల 26వ తేదీ నుంచి గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లు మూతపడటంతో పల్లె ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణ జబ్బులతో పాటు పిల్లలకు, గర్భిణులకు వైద్యం, బీపీ, షుగర్ జబ్బులకు మందులు ఇక్కడ లభించేవి. ఇప్పుడు గ్రామీణ ప్రజలు 25–30 కిలోమీటర్ల దూరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ విషయంలో గర్భిణీలు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీహెచ్‌సీలకు వెళ్లాల్సి రావడంతో ఆ రోజుకు పనులు మానుకోవడమే గాకుండా రానుపోను ఛార్జీలు వ్యయం అవుతున్నాయని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదు



మా న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏపీఎంసీపీఏ ఆధ్వర్యంలో దశలవారీగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 24, 25వ తేదీల్లో విజయవాడలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సీహెచ్‌వోలందరూ మహాధర్నాలో పాల్గొన్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేదు. జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నాము. ఇందులో భాగంగా నిరవధిక సమ్మె చేస్తూ శాంతియుత పద్ధతిలో ఆందోళనకు దిగాం.

– టీఎస్. చందన, ఏపీ ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు

సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాలి



ఆరేళ్లు దాటిన సీహెచ్‌వోలను క్రమబద్ధీకరించాల్సి ఉన్నా చేయడం లేదు. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటివ్ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు తీర్చే విధంగా హామీ ఇవ్వాలి. ఈ డిమాండ్లు తీర్చేవరకు మేము శాంతియుత నిరసనలు కొనసాగిస్తాం.

–కె.నాగరాజు, ఏపీ ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో అసోసియేషన్ జిల్లా కోశాధికారి, కర్నూలు

లంచం అడిగితే సమాచారమివ్వండి

- టోల్‌ఫ్రీ నెంబర్ 1064
- ఏసీబీ నూతన డీఎస్పీ దివిటి సోమన్న



బాధ్యతలు స్వీకరిస్తున్న ఏసీబీ డీఎస్పీ సోమన్న

కర్నూలు: ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే (లంచం అడిగితే) టోల్‌ఫ్రీ నెంబర్ 1064కి కాల్ చేసి సమాచారం అందించాలని అవినీతి నిరోధక శాఖ కర్నూలు రేంజ్ డీఎస్పీ దివిటి సోమన్న ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దాదాపు 11 నెలల కాలంగా ఏసీబీ డీఎస్పీ పోస్టు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వం ఇటీవల సోమన్నను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం కలెక్టరేట్ వెనక ఎ.క్యాంప్‌లో ఉన్న ఏసీబీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా కనగానపల్లె మండలం వేపకుంట గ్రామానికి చెందిన సోమన్న 1991లో ఎస్‌ఐ హోదాలో పోలీసు శాఖలో చేరారు. క్రిష్ణగిరి, సంజామల, నందవరం, వెల్దుర్తి, అనంతపురం పీటీసీలో విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి పొందిన తర్వాత సీఐడీ, ప్యాపిలి, ఆదోని తాలూకా, లక్కిరెడ్డిపల్లె పీఎస్‌లో పనిచేశారు. 2020లో డీఎస్పీగా పదోన్నతి పొంది సీఐడీ, ఆదోని డీఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం అమరావతి హెడ్‌క్వార్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సోమన్నను కర్నూలు రేంజ్ ఏసీబీ విభాగానికి నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. అవినీతి అధికారుల సమాచారం తన ఫోన్ నెంబర్ 9440446178కు కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

11 నెలలైనా కొత్త పింఛను ఒక్కటీ లేదు!

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వం ఏర్పడి 11 నెలలు అవుతోంది. ఇప్పటి వరకు కొత్త పింఛను ఒక్కటీ ఇవ్వకపోగా.. ప్రతినెలా గుట్టుచప్పుడు కాకుండా పింఛన్లలో కోత విధిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. మే నెలలో కూడా 1,006 పింఛన్లను తొలగించడం గమనార్హం. ఇకపోతే దివ్యాంగుల పింఛను వెరిఫికేషన్ కార్యక్రమం నెలల తరబడి కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60వేల దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. ఇప్పటి వరకు 23వేల పింఛన్ల వరకే వెరిఫికేషన్ పూర్తయింది. వీటిలో 60 శాతం వరకు అనర్హులున్నట్లు ప్రచారం జరుగుతోంది. పింఛన్ల ఏరివేత తర్వాతనే కొత్త పింఛన్లు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇందుకు మరో మూడు, నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం. 2024 మే నెలలో జరిగిన ఎన్నికల్లో సూపర్–6లో భాగంగా 50 ఏళ్ల నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరికీ వృద్ధాప్య పింఛను ఇస్తామని ప్రకటించిన చంద్రబాబు ఆ హామీనే విస్మరించడం గమనార్హం.

నేడు పింఛన్ల పంపిణీ

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కింద మే నెల పింఛన్ల పంపిణీ గురువారం మొదలుకానుంది. ఉమ్మడి జిల్లాలో 4,51,886 పింఛన్లకు రూ.195.9 కోట్లు విడుదలయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తారు. ఇదిలాఉంటే పింఛన్ల పంపిణీలో అక్రమాలపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ప్రతినెలా ముఖ్యమంత్రి కార్యాలయం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ ద్వారా పింఛనుదారులకు ఫోన్ చేసి అవినీతిపై ఆరా తీస్తోంది. ఆ వివరాలను సెర్ప్ జిల్లా కలెక్టర్‌కు పంపింది. దీనిపై సమగ్రంగా విచారణ జరపాలని డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డిని కలెక్టర్ ఆదేశించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టైమ్ స్లాట్ బుకింగ్

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలోని 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో బుధవారం నుంచి టైమ్‌స్లాట్ బుకింగ్ ప్రారంభమైంది. క్రయవిక్రయదారులు తమకు అనుకూలమైన సమయంలో స్లాట్‌ను బుక్ చేసుకుని వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి వీలుంటుంది. కాగా పైలెట్ ప్రాజెక్టుగా ఏప్రిల్ 4వ తేదీ నుంచి నంద్యాల, కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో టైమ్ స్లాట్ బుకింగ్‌లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఈ క్రమంలో మిగిలిన అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కూడా టైమ్ స్లాట్ బుకింగ్ విధానం బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. కాగా 2020 నుంచే టైమ్‌స్లాట్ బుకింగ్ విధానం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులో ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక దీనిని మరోసారి మొదటిసారి ప్రారంభిస్తున్నట్లు చెప్పి ప్రచారం చేసుకోవడం గమనార్హం.

రేషన్ అందుతుందో.. లేదో?

చిప్పగిరి: రేషన్ కార్డుదారులందరూ ఏప్రిల్ నెల చివరి నాటికి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. చిప్పగిరి మండలంలో మొత్తం 13 పంచాయతీల్లో 7,892 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకు 80 శాతం మాత్రమే ఈకేవైసీ పూర్తయినట్లు అధికారులు తెలుపుతున్నారు. మిగతా 20 శాతం మందిలో 'రేషన్ అందుతుందో లేదో?' అని ఆందోళన నెలకొని ఉంది.



ఈ కేవైసీ కోసం సచివాలయంలో ప్రజలు

వైభవంగా అక్షయ తృతీయ వేడుక



రాఘవేంద్రస్వామి సేవలో పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పవిత్ర అక్షయ తృతీయ వేడుక వైభవంగా నిర్వహించారు. బుధవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నేతృత్వంలో వేడుకలు శాస్త్రోక్తంగా చేపట్టారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి గంధ లేపనం గావించి విశేష పూజలు కానిచ్చారు. రెండు గంటల పాటు వేద మంత్రోచ్చారణలతో పూజోత్సవాలు నిర్వహించారు. వేడుక భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

వైఎస్సార్‌సీపీ విభాగ కమిటీలో కర్నూలు వాసులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో కర్నూలుకు చెందిన పలువురికి పదవులు దక్కాయి. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో ప్రధాన కార్యదర్శిగా ఎం.రాజేశ్వరరెడ్డి, కార్యదర్శులుగా దండు లక్ష్మీకాంతరెడ్డి, షేక్ యూనుస్ బాషా, సంయుక్త కార్యదర్శిగా సందీప్ రెడ్డిలను నియమించారు. ఈ మేరకు బుధవారం రాత్రి పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది.

భానుడి భగభగలు

కర్నూలు (అగ్రికల్చర్): భానుడి భగభగలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే నంద్యాల జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పాణ్యం, దొర్నిపాడులో 42.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బండి ఆత్మకూరులో 42.5, రుద్రవరం, మహానంది, ఆత్మకూరు, గడివేములలో 42.1, ఆళ్లగడ్డ 42.2 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు ఉక్కిరిబిక్కిరి చేశాయి. కర్నూలు జిల్లాలో అత్యధికంగా కర్నూలు అర్బన్‌లో 41.8, కోడుమూరులో 41.6 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఆవిర్భావం

- గ్రామీణ బ్యాంకులన్నీ ఏపీజీబీలో విలీనం

కర్నూలు(అగ్రికల్చర్): రాష్ట్రంలోని గ్రామీణ బ్యాంకులన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చాయి. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, సప్తగిరి గ్రామీణ బ్యాంకులను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీబీ)గా మార్పు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. గ్రామీణ బ్యాంకులన్నీ మే నెల 1 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు కింద పని చేస్తాయి. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు 1,384 శాఖలతో పెద్ద బ్యాంకుగా అవతరించింది. ఇప్పటివరకు గ్రామీణ బ్యాంకులకు కెనరా బ్యాంకు స్పాన్సర్డ్ బ్యాంకుగా ఉంది. ఇక నుంచి స్పాన్సర్డ్ బ్యాంకుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యుబిఐ) ఉండనుంది. ప్రస్తుతానికి ఖాతా నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు యథాతథంగా ఉంటాయని బ్యాంకు వర్గాలు తెలిపాయి. విలీనం తర్వాత ఏర్పడే బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని ఇప్పటి వరకు ఏపీజీబీ ఉద్యోగ సంఘాలు కోరుతూ వచ్చాయి. అయితే సంఘాల కోరిక నెరవేరలేదు.

అభ్యుదయవాది బసవేశ్వరుడు



బసవేశ్వరుని చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, వీరశైవ నాయకులు

కర్నూలు కల్చరల్: సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించిన అభ్యుదయవాది మహాత్మా బసవేశ్వరుడు అని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. మహాత్మా శ్రీ బసవేశ్వర జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం బసవేశ్వర చిత్రపటానికి జిల్లా కలెక్టర్, వీరశైవ, జంగమ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో మహాత్మా బసవేశ్వరుని పేరుతో ఒక సర్కిల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం హర్షిందగ్గ విషయమన్నారు. సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్, వీరశైవ ఐక్య సంఘం అధ్యక్షులు ఏజీ మల్లికార్జునప్ప, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరప్ప, సభ్యులు విశ్వేశ్వరయ్య, శివరాజ్, యాగంటయ్య, శెట్టి వీర శేఖరప్ప, జంగమ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులు త్వరితగతిన పరిష్కరించండి

కర్నూలు: హిట్ అండ్ రన్ కేసులను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సరైన నష్టపరిహారం ఇప్పించాలని జిల్లా జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఉమ్మడి కర్నూలు జిల్లా అధికారులతో హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష నిర్వహించారు. కర్నూలు జిల్లాలో 76, నంద్యాల జిల్లాలో 38 హిట్ అండ్ రన్ కేసులు దర్యాప్తు దశలో(ప్రాసెస్) ఉన్నాయని అధికారులు న్యాయమూర్తి దృష్టికి తీసుకొచ్చారు. వాటిని త్వరితగతిన పరిష్కరించి బాధితులకు సరైన నష్టపరిహారం ఇప్పించాలన్నారు. సమావేశంలో నంద్యాల జిల్లా రెవెన్యూ ఆఫీసర్ రాము నాయక్, కర్నూలు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ భారతి చవాన్, కర్నూలు జిల్లా రెవెన్యూ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజేశ్వరి, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, డీసీఆర్‌బీ సీఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి

క్లుప్తంగా

వీఓఏ ఆత్మహత్య

బేతంచెర్ల: బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన వీఓఏ జింక సుధాకర్(40) బుధవారం ఉదయం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య రజని, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సుమారు 20 సంవత్సరాలకు పైగా వీఓఏగా పనిచేస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న వెలుగు ఏపీఎం మధు సూధన్ గౌడు, మెప్మా సిబ్బంది గ్రామానికి చేరుకుని వీఓఏ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. సుధాకర్ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

మురుగు గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

కర్నూలు: కల్లూరు మండలం ముజఫర్ నగర్ శివారులోని అయ్యప్పస్వామి నగర్ వద్ద ఉన్న లెదర్ ఫ్యాక్టరీ సమీపంలో ఉన్న మురికి గుంతలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. లెదర్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే వృథా నీరు సమీపంలో నిల్వ ఉండి కుంటగా మారింది. అందులో గుర్తు తెలియని వ్యక్తి పడి మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుంది. నీటిలో మునిగిపోవడం వల్ల మొత్తం ముఖమంతా ఉబ్బిపోయి గుర్తు పట్టని విధంగా ఉంది. నలుపు షర్టు, నలుపు ప్యాంటు ధరించాడు. ఆచూకీ తెలిసినవారు 91211 01062, 89196 68119కు సమాచారం అందించాలని నాల్గవ పట్టణ సీఐ మధుసూదన్ గౌడ్ తెలిపారు.

స్కూల్ యూనిఫామ్ పరిశీలన



యూనిఫామ్‌ను పరిశీలిస్తున్న సమగ్ర శిక్ష జిల్లా ఆకోర్డినేటర్

బేతంచెర్ల: పట్టణంలోని సాయి ధరణిలో ఉన్న జెడ్పీ హైస్కూల్లో మండలంలోని విద్యార్థులకు మంజూరైన యూనిఫామ్‌ను సమగ్ర శిక్ష జిల్లా ఆకోర్డినేటర్ ప్రేమంత్ కుమార్ బుధవారం పరిశీలించారు. మగ పిల్లలకు, ఆడ పిల్లలకు ఒక్కొక్కరికి 3 జతల చొప్పున్న యూనిఫామ్ ప్రభుత్వం సరఫరా చేసిందన్నారు. విద్యార్థులకు ఇస్తున్న నోట్ పుస్తకాలను నాణ్యతగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నంద్యాల ఏఎం లలిత, ఎంఈఓ సోమశేఖర్ పాల్గొన్నారు.

పిడుగుపాటుకు జీవాలు మృతి



మృతిచెందిన జీవాలు

అవుకు:చెన్నంపల్లి గ్రామంలో బుధవారం పిడుగుపాటుకు నాలుగు జీవాలు మృతి చెందాయి. బాధితులు తెలిపిన మేరకు.. సింగన పల్లె గ్రామానికి చెందిన కొత్తపేట ప్రసాదు తన భార్య నాగలక్ష్మితో కలిసి జీవాలను చెన్నంపల్లె గ్రామ సమీపంలో జీవాలను మేపుతుండగా ఉరుములతో నాలుగు జీవాలు మృతి చెందాయని తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థిని మృతి

బొమ్మలసత్రం: పట్టణంలోని ఓ కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థిని నేత్ర(24) విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. టూటౌన్ సీఐ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లికిచెందిన నేత్ర గత కొంత కాలంగా పట్టణంలోని ఓ బ్యాంక్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ తీసుకుంటుంది. అయితే సమీపంలోని ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటుంది. హాస్టల్‌కు సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లపై ప్రమాదవశాత్తు చేయి తగిలి అక్కడికక్కడే కుప్పకూలింది. హాస్టల్ నిర్వాహకులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే నేత్ర ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో ఆమె కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక 26వ తేదీ మృతి చెందినట్లు సీఐ తెలిపారు. నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థిని మృతి చెందినట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అధికారులు ఈ వంక చూడరు?

- యథేచ్ఛగా వాగులు, వంకలు కబ్జా చేస్తున్న కూటమి నేతలు
- వంక పోరంబోకు స్థలంలో షెడ్లకు ఇంటి నంబర్ల కేటాయింపు



ఆక్రమిత షెడ్డుకు ఇంటినంబర్ కేటాయించిన మున్సిపల్ అధికారులు





బోగందాని వంక పక్కన వెలసిన రేకులషెడ్డు, ఐటీఐ కళాశాలకు ఎదురుగా వంకను పూడ్చివేసేందుకు వేస్టేజీని కుప్పలుగా పోసిన దృశ్యం

డోన్: ఖాళీ జాగా కనిపిస్తే చాలు కూటమి నేతలు పాగా వేస్తేన్నారు. వాగులు, వంకలను సైతం వదలడం లేదు. రాత్రిరాత్రికి ఆక్రమణకు గురవుతున్నా అధికారులు అటు వైపు కన్నెతి చూడటం లేదు. అంతేకాకుండా కొందరు అధికారులు ఆక్రమణదారులకు అండగా నిలుస్తున్నారు. కూటమి నేతల ఆక్రమణలకు చెరువులు సైతం ఒట్టిపోయే ప్రమాదం పొంచి ఉంది. డోన్ పట్టణ నడిబొడ్డున ఉన్న బోగందాని వంక.. కొచ్చెర్వు చెరువు, వెంకటాపురం, ఉడుములపాడు, జగదుర్తి చెరువులకు సమృద్ధిగా నీరందించేది. ఈ వంకను పూడ్చేందుకు కొందరు టీడీపీ నాయకులు పూడ్చివేస్తున్నారు. మరోవైపు వంకను ఆనుకొని ఓ టీడీపీ కార్యకర్త రేకులషెడ్డును నిర్మించి నిబంధనలకు విరుద్ధగా మున్సిపాలిటీ నుంచి ఇంటి నంబర్‌ను పొందడం జరిగింది. ఈ ప్రాంతంలో సెంటు స్థలం రూ.10 లక్షల ధర పలుకుతుండటంతో టౌన్ ప్లానింగ్ అధికారులతో కుమ్మక్కై ఇంటి నంబర్ పొందేందుకు పలువురు నేతలు పావులు కదుపుతున్నారు. దీంతో వంక నానాటికి ఆక్రమణతో కుశించికుపోయి నీటి ప్రవాహం నిలిచిపోయి చెరువులకు నీరందని పరిస్థితి ఏర్పడుతుంది. వెంటనే మైనర్ ఇరిగేషన్ అధికారులు ఈ వంక వెంట వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే లోతట్టు కాలనీలు జలమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.



సువిశాలంగా ఉన్న వంక ఆక్రమణలతో కుచించుక పోయిన దృశ్యం

శ్రీశైలంలో భారీ వర్షం



భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. భారీగా ఈదురు గాలులు వీచాయి. వడగండ్ల వాన కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులకు క్షేత్రంలో పలు చోట్ల వక్షాలు నేలకొరిగాయి. భారీ వర్షాలకు సాంకేతిక లోపంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ అధికారులు ఎంత శ్రమించినప్పటికీ రాత్రి వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు. మల్లన్న దర్శనానికి వచ్చిన భక్తులు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడ్డారు.

ప్రియుడి ఇంటి ముందు ట్రాన్స్‌జెండర్ ధర్నా



మాట్లాడుతున్న హాసినిగౌడ్

ఆదోని రూరల్: తనను మోసం చేశాడంటూ ఆదోని మండలం బైచిగేరికి చెందిన యువకుడి ఇంటి ఎదుట ఓ ట్రాన్స్‌జెండర్ ఆందోళనకు దిగింది. బాధితురాలి కథనం మేరకు.. నాలుగేళ్ల క్రితం ఆదోని మండలం బైచిగేరికి చెందిన గణేష్ అనే యువకుడు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌కు వెళ్లాడు. అక్కడ అన్నమయ్య జిల్లా మదనపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు హాసినిగౌడ్ ఊరఫ్ రామకృష్ణ(24) అనే ట్రాన్స్‌జెండర్‌తో పరిచయం ఏర్పడి, సహజీవనం చేస్తూ వచ్చాడు. గతేడాది గణేష్‌కు పెళ్లి కుదరడంతో ట్రాన్స్‌జెండర్ హాసినిని వదిలేసి సొంత గ్రామానికి రావడంతో 2024 జూన్ 10న బైచిగేరి గ్రామానికి వచ్చి తనకు న్యాయం చేయాలని హాసినిగౌడ్ నిరసన తెలిపింది. ఆదోని తాలూకా పోలీసులు ఆమె నివాసముంటున్న హైదరాబాద్‌లోని సైబరాబాద్ కమిషనరేట్ సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మేరకు హాసినిగౌడ్ అక్కడ ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. అయితే మరలా బుధవారం వచ్చి బైచిగేరిలో గణేష్ ఇంటి ముందు ధర్నాకు దిగింది. ''నువ్వే నా ప్రాణం, నా సర్వస్వం.. నువ్వు లేనిదే నేను లేనంటూ నా వెంట పడ్డాడు. నేను ఒక ట్రాన్స్‌జెండర్. నాతో నీవు సావాసం చేస్తే ఎలాంటి ఉపయోగం ఉండదని చెప్పాను. అయినా వినకుండా, తననే పెళ్లి చేసుకుంటానని వెంటబడ్డాడు. నాకు పిల్లలు పుట్టరని చెప్పినప్పటికీ వినిపించుకోలేదు. మా ఇంటి నుంచి రూ.5 లక్షలు తీసుకెళ్లి ఇద్దరం పెళ్లి చేసుకుని హైదరాబాద్‌లో నివాసముంటున్నామని హాసినిగౌడ్ వాపోయింది. తన డబ్బులు రూ.5 లక్షలు అయినా ఇప్పించాలని, లేకపోతే గణేష్‌తో కాపురం అయినా చేయించాలని డిమాండ్ చేసింది. సమాచారం అందుకున్న తాలూకా ఎస్ఐ రామాంజనేయులు గ్రామానికి చేరుకుని విచారించారు. హాసినిగౌడ్ గణేష్‌పై ఇదివరకే కేసు హైదరాబాద్‌లో నమోదయ్యిందని, ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి న్యాయం చేస్తామని ఎస్ఐ చెప్పడంతో వారు హాసినిగౌడ్, ఇతర ట్రాన్స్‌జెండర్లు ధర్నా విరమించారు.



కూటి కోసం పాము చేత పట్టి

కూటి కోసం కోటి విద్యలన్నారు పెద్దలు. కడుపు నింపుకోవడానికి వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన వెంకటమ్మ అనే మహిళ కొండచిలువను మెడలో వేసుకుని భిక్షాటన చేస్తోంది. మండలంలోని పల్లెల్లో భిక్షాటన చేస్తూ కనిపించిన మహిళ పలు ఆసక్తికర విషయాలు చెప్పింది. గొంతుకు చుట్టుకుంటే ప్రాణానికే ప్రమాదం కదా అని ప్రశ్నిస్తే ప్రస్తుతం భిక్షాటన చేయాలంటే ఏదో ఒక కొత్తదనం ఉంటే తప్పా పైసలు ఇవ్వడం లేదని చెబుతోంది. పాముకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు, కప్పలు, ఎలుకలను వేస్తానని, కొండచిలువను చూసేందుకు వచ్చి ఒకొక్కరు రూ.10, రూ.5 ఇస్తున్నారని కోటివిద్యల్లో ఇదోకటి అంటూ నవ్వుతూ చెబుతోంది.

– దొర్నిపాడు

సెంటిమెంట్ పండింది

- అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోళ్లకు పోటెత్తిన జనాలు
- ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.250 కోట్ల మేర అమ్మకాలు?
- వివాహాలు ఉండటంతో పెరిగిన కొనుగోళ్లు



కర్నూలులోని బంగారం దుకాణంలో కొనుగోలుదారులు

కర్నూలు(అగ్రికల్చర్): సెంటిమెంటు పండింది. అక్షయ తృతీయను పురస్కరించుకుని బుధవారం బంగారం కొనుగోలు చేసేందుకు వినియోగదారులకు దుకాణాలకు పోటెత్తారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ తదితర పట్టణాల్లో కొనుగోలుదారులతో బంగారం దుకాణాలు కిటకిటలాడాయి. ఉదయం 9 గంటలకే బంగారం దుకాణాలు తెరుచుకున్నాయి. రాత్రి ప్రొద్దుపోయే వరకు జనాల రద్దీ తగ్గలేదు. ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లా మొత్తం మీద దాదాపు రూ.250 కోట్ల వ్యాపారం జరిగి ఉంటందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కార్పొరేట్ జ్యువెలరీ సంస్థలు 10 రోజులుగా ఆఫర్ల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నాయి. గత ఏడాది అక్షయ తృతీయ రోజున 10 గ్రాముల బంగారం ధర రూ.73,240గా ఉంది. ఈ అక్షయ తృతీయ నాటికి 22 క్యారెట్ల బంగారం ధర రూ.89,800, 24 క్యారెట్ల ధర రూ.97,960కి చేరాయి. ఈ ధర్మపై తరుగు పేరుతో డిజైన్ బట్టి 6 నుంచి 22 శాతం సొమ్ము అదనంగా రాబట్టినట్లు స్పష్టమవుతోంది. మే నెలలో వివాహాది శుభకార్యాలు ఉండటంతో అక్షయ తృతీయ అమ్మకాలు జోరుగా జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ అక్షయ తృతీయ రోజున బంగారం కొనుగోళ్లు పెరిగినట్లు తెలుస్తోంది. ఈ రోజున బంగారం కొనుగోలు చేస్తే లక్ష్మీదేవిని ఇంటిలోకి ఆహ్వానించినట్లే అన్న సెంటిమెంటు కూడా బాగా కనిపించింది. కార్పొరేట్ బంగారం దుకాణ సంస్థలు అక్షయ తృతీయ ఆఫర్ల పేరుతో పెద్ద ఎత్తున చేసుకున్న ప్రచారం గ్రామీణ ప్రాంతాల ప్రజల్లోకి కూడా వెళ్లడంతో కొనుగోళ్లు కొంత పెరిగినట్లు తెలుస్తోంది.

కుక్కను తప్పించబోయి..

- రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పరుశురాముడు

కర్నూలు: కర్నూలు బళ్లారి చౌరస్తా సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా మండలం తరిగోపుల గ్రామానికి చెందిన మండ్ల పరుశురాముడు (26) కర్నూలు నగరంలోని సాయికృష్ణ డిగ్రీ కళాశాల సమీపంలో నివాసముంటాడు. బుధవారం తెల్లవారుజామున హైదరాబాదు వైపు నుంచి కర్నూలులోకి వచ్చే సర్వీసు రోడ్డులో ఆంజనేయస్వామి గుడి వెనుక రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. బైక్‌పై స్నేహితుడు ఎల్లా నాయుడుతో కలసి వస్తూ ఆంజనేయస్వామి గుడి వద్ద అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. బైక్ నడుపుతున్న పరుశురాముడు తలకు బలమైన గాయం కావడంతో అ క్కడికక్కడే చనిపోయాడు. వెనుక కూర్చున్న ఎల్లా నాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరుశురాముడు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టును ఢీకొన్న లారీ



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

కోడుమూరు రూరల్: ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి లారీ అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్న సంఘటన బుధవారం కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలు.. డోన్ నుంచి ఆదోని వైపు వెళుతున్న లారీ ప్యాలకుర్తి సమీపాన ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును తప్పించే క్రమంలో రోడ్డు సైడ్‌కు ఉన్న కల్వర్టును వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ చక్రాలన్నీ ఊడిపోవడంతో పాటు, లారీ డ్రైవర్, క్లీనర్లు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద పరిస్థితి చూస్తే ఘోర ప్రమాదం నుంచి బయటపడినట్లుగా ఉంది. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎస్ఐ ఎర్రిస్వామి ప్రమాద స్థలాన్ని చేరుకుని పరిస్థితి సమీక్షించి రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.



లారీ టైర్లు విరిగి రోడ్డుపై పడిన దృశ్యం



హొళగుందలో ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం

ఘనంగా బసవ జయంతి

హొళగుంద: బసవ జయంతి వేడుకలు మండలంలో వీరశైవ లింగాయితులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో బసవేశ్వరస్వామి చిత్ర పటానికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు, చిన్నారుల కలశాలతో బసవేశ్వరస్వామి చిత్రపటాలను, ఎద్దులను గ్రామ వీధుల్లో ఊరేగించారు. కర్ణాటక సంప్రదాయాలను పుణికి పుచ్చుకున్న స్థానిక ప్రజలు బసవేశ్వరుడిగా కొలిచే ఎద్దులను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించడం ఆనవాయితీ. బుధవారం ఇళ్లల్లో ఎద్దులను ప్రత్యేక అలంకరణ, పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. అలాగే ఎల్లార్తిలో నందికోలోత్సవం మధ్య బసవేశ్వరుని చిత్రపటాన్ని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

బంగారు దుకాణంలో చోరీ





పత్తికొండలోని బంగారు దుకాణంలో ఖాళీగా ఉన్న పెట్టెలు,దుండగులు పగులగొట్టిన పైకప్పు

పత్తికొండ రూరల్:పత్తికొండ–గుత్తి రోడ్డు కూడలిలో మెయిన్ రోడ్డులో ఉన్న బంగారు దుకాణంలో చోరీ జరిగింది. దూదేకొండ గ్రామానికి చెందిన పింజరి అక్బర్ సాహెబ్ గత 13 ఏళ్లుగా పత్తికొండ పట్టణంలో బంగారు దుకాణం నిర్వహిస్తున్నాడు. వెండి, బంగారు ఆభరణాలు తయారు చేస్తూ విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి షాపునకు తాళం వేసి సొంతూరుకు వెళ్లాడు. బుధవారం ఉదయం షాపు తెరిచి చూడగా గుర్తు తెలియని వ్యక్తులు పైకప్పు తొలగించి చోరీకి పాల్పడినట్లు గుర్తించాడు. షాపులోని లాకర్‌లో ఉంచుకున్న 8 జతల బంగారు కమ్మలు, ఒక టిన్నర కేజీల వెండి ఆభరణాలతో పాటు రూ.3 లక్షల నగదును అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుకాణాన్ని స్థలాన్ని పరిశీలించి, వేలిముద్రలు సేకరించినట్లు సీఐ జయన్న తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కుందూనదిలో మునిగి యువకుడి మృతి



మృతి చెందిన జయవర్ధన్

కోవెలకుంట్ల: రేవనూరుకు చెందిన ఓ యువకుడు గొర్రెలు మేపుకునేందుకు వెళ్లి బుధవారం ప్రమాదశాత్తు కుందూనదిలో మునిగి మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన బాలుడు, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు జయవర్ధన్(20) పదవ తరగతి వరకు విద్యనభ్యసించి మధ్యలో చదువు మానేశాడు. గొర్రెల కాపరిగా ఉంటూ తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఉదయం మరో ఇద్దరు యువకులతో కలిసి గొర్రెలు మేపుకునేందుకు రేవనూరు– కలుగొట్ల గ్రామాల మధ్య ప్రవహిస్తున్న కుందూనది వైపు వెళ్లారు. నది ఆవతలి ఒడ్డుకు గొర్రెలను తోలుకపోయే క్రమంలో ముగ్గురు నదిలో దిగారు. జయవర్ధన్ లోతు ఎక్కువ ఉన్న వైపు వెళ్లి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. మిగిలిన యువకులు పెద్దగా కేకలు వేయడంతో పక్క పొలాల్లో ఉన్న రైతులు నదిలో దిగి గాలించగా అప్పటికే మృతి చెందాడు. ఈ మేరకు రేవనూరు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, బైక్‌ను చూపుతున్న ఎక్సైజ్ సీఐ వరలక్ష్మి, సిబ్బంది

డోన్ రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం సీఐ వరలక్ష్మి కేసు వివరాలను వెల్లడించారు. అందిన సమాచారం మేరకు కొచ్చెర్వు గ్రామంలో దాడి చేయగా గ్రామానికి చెందిన మేకల లక్ష్మన్న, వడ్డే శ్రీనివాసులు అక్రమంగా మద్యం విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. వారి వద్ద నుంచి 192 కర్ణాటక మద్యం సీసాలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు. సమావేశంలో ఎస్ఐలు సోమశేఖర్‌రావు, దౌలత్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, సుధాకర్‌రెడ్డి, గోపాల్, భషీర్, ఉమాకాంత్‌రెడ్డి, చెన్నకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీరుసీసాతో దాడి

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని వైన్‌షాపు వద్ద ఉన్న ఓ దుకాణంలో బుధవారం రాత్రి ఘర్షణ చోటుచేసుకుంది. అబ్బీపురం గ్రామానికి చెందిన యువకుడు దుకాణంలో వస్తువులు కొనుగోలు చేసి రూ.30 ఫోన్ పే చేశాడు. అయితే ఓ నంబరుకు పంపించబోయి మరో నెంబరుకు పంపించాడు. దీంతో తనకు డబ్బు రాలేదని దుకాణం యజమాని చెప్పడంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగింది. కోపోద్రిక్తుడైన యువకుడు బీరుసీసాతో దుకాణం యజమానిపై దాడి చేయడంతో స్వల్పగాయమైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేస్తున్నారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేని పోలీసులు తెలిపారు.

గిర గిర తిరగాలి బొంగరం..!



పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు ఆటపాటల్లో మునిగి తేలుతున్నారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ఆటల్లో బిజీ అయ్యారు. మారుతున్న కాలానుగుణంగా సెల్‌ఫోన్లకు బానిస కాకుండా పిల్లలను వారి తల్లిదండ్రులు పాతకాలంనాటి ఆటల వైపు దృష్టి మళ్లిస్తున్నారు. ఖోఖో, కబడ్డీ, క్యారమ్స్, బిల్లంగోడు, బొంగరాలు, తదితర ఆటలపై పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు. కోవెలకుంట్ల పట్టణంలో నాగుల కట్ట సమీపంలో కొందరు పిల్లలు బొంగరాల ఆట ఆడుతూ కనిపించారు.

– కోవెలకుంట్ల